## సత్వర న్యాయ పరిష్కారం

న్యాయశాఖల్లో సామర్థ్యాన్ని పెంచటానికి అదాలత్ ఏఐ దోహదం చేస్తుంది. ఇది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఆధారంగా పనిచేస్తుంది. ఉత్కర్ష్ సక్సేనా, అర్ఘ్య భట్టాచార్య దీన్ని కనుగొన్నారు. ఎమ్ఐటీ, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల్లో దీన్ని రూపొందించారు. ''మేం న్యాయవాదులకు, స్టెనోగ్రాఫర్ల కోసం మాత్రమే కాదు. సాక్ష్యాల నమోదు, కోర్టు ఉత్తర్వుల కచ్చితత్వాన్ని పెంచటానికి ఈ టూల్ రూపొందించాం'' అని సక్సేనా అంటున్నాడు. ఏఐ ఆధారిత సాధనాల వినియోగం దేశవ్యాప్తంగా అన్నిట్లోనూ విస్తరిస్తున్నది. దేశంలోని కొన్ని కోర్టులు కూడా దీనిని విస్తృతంగా ఉపయోగించుకోవటం మొదలుపెట్టాయి. దేశంలో పది నుంచి 20 శాతం కోర్టుల్లో అదాలత్ ఏఐని ఏర్పాటు చేయాలనేది మా లక్ష్యం. నైజీరియా, కెన్యా వంటి ఇతర దేశాలు ఆసక్తి చూపుతున్నాయని ఆయన చెప్పారు. ''రాబోయే రోజుల్లో ఏఐ నుంచి పాలనాపరమైన సహకారం అందుతుంది. న్యాయమూర్తులకు చట్టపరమైన పరిశోధనలకు, వేగంగా, న్యాయంగా తీర్పులను అందించగలుగుతారు'' అని సక్సేనా చెప్పుకొచ్చారు.

• **ఉత్కర్ష్ సక్సేనా,** సీఈఓ, సహవ్యవస్థాపకుడు, అదాలత్ ఏఐ



## టాలెంట్ పూల్

లింక్డ్‌ఇన్ మాదిరిగా అన్‌స్టాప్ కూడా ఓ టాలెంట్ పూల్. కంపెనీలు అభ్యర్థుల విద్యార్హతలను, వారు చదివిన విద్యాసంస్థలను మాత్రమే పట్టించుకోకుండా వారికి ఉన్న ఇతర నైపుణ్యాలను సామర్థ్యాలను గుర్తించి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో అంకిత్ అగర్వాల్ ఈ స్టార్టప్‌ని ప్రారంభించాడు. నియామకాల్లో నైపుణ్య ఆధారిత మదింపు ఉండాలనేది తన ఉద్దేశం అంటున్నాడు అంకిత్. ఆగస్టు 2023లో ఈ సంస్థ 5 మిలియన్ డాలర్ల నిధులను సేకరించింది. మైనావి, జపాన్ హెచ్ఆర్ టెక్ ఫర్మ్ జాబ్ బోర్డు వంటి సంస్థలు ఫండింగ్ రౌండ్‌లో పాల్గొన్నాయి.

• **అంకిత్ అగర్వాల్,** ఫౌండర్, సీఈఓ అన్‌స్టాప్



## క్రీడా ప్రేమికుల వేదిక

క్రీడల ప్రేమికులందరినీ ఒక చోట చేర్చేందుకు 'స్పోర్ట్స్ యారీ' ప్లాట్‌ఫాం పనిచేస్తున్నది. దీన్ని 2021లో సుశాంత్ మెహతా ప్రారంభించాడు. ప్రస్తుతం క్రీడల్లో రాణిస్తున్న అథ్లెట్లు, సాధారణ ఆటగాళ్లు, కొత్తగా ఆటల్లోకి ప్రవేశం చాలనుకునే ఉత్సాహవంతులందరూ ఈ సైట్ పట్ల ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. చిన్నవాళ్లు పెద్దవాళ్లు అనే తేడా లేకుండా అందరూ తమ అభిప్రాయాలను పంచుకుంటారు. చర్చల్లో పాల్గొంటారు. వాటితోపాటు నిపుణుల వ్యాసాలు, టిప్స్, ఇన్‌సైట్స్ అన్నీ ఇందులో ఉంటాయి. అంతా ఒక ఇంటరాక్టివ్ కమ్యూనిటీగా ఉంటారు.

''మేం యువతకు ప్రాధాన్యం ఇస్తాం. మా యాంకర్లు, ప్రజెంటర్లు, ఆఖరికి బ్యాక్ ఎండ్‌లో పనిచేసేవాళ్లంతా కొత్తవాళ్లే. ఇందులో గ్రామీణ ప్రాంతాల వారితోపాటు, పట్టణ ప్రాంతాలవారు కూడా ఉంటున్నారు'' అంటాడు సుశాంత్. ఈ వ్యాపారంలో 50 శాతం పైగా మార్జిన్స్ సంపాదిస్తున్నారు. వ్యక్తిగత అభివృద్ధి, కమ్యూనిటీ బిల్డింగ్, సంపూర్ణ సంక్షేమానికి క్రీడలు దోహదం చేసే ప్రపంచాన్ని ఆయన కలగంటున్నారు. ''ప్రస్తుతం డిజిటల్ మీడియాగానే ఉన్నాం. కానీ త్వరలోనే లీగ్ లోకి అడుగుపెట్టాలని ఆలోచిస్తున్నాం'' అని తన భవిష్యత్ ప్రణాళికలను పంచుకున్నాడు.

• **సుశాంత్ మెహతా.** సీఈఓ, స్పోర్ట్స్ యారీ






## కాఫీ వ్యాపారంలో కొత్త రుచులు

అభిజిత్ నాయకత్వంలో 'అబ్ కాఫీ' సంస్థ భారతీయ కాఫీ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఓ గుర్తింపు తెచ్చుకుంది. కేవలం 20 నెలల కాలంలో 40 అవుట్‌లెట్లు ఏర్పడ్డాయి. 200 మంది ఉద్యోగులతో 50 కోట్ల నిధులను సేకరించగల స్థాయికి చేరింది. ఈ సంస్థ నెలవారీగా 20 నుంచి 25 శాతం రెవెన్యూ గ్రోత్ సాధిస్తూ.. స్టార్టప్ విభాగంలోనే ఒక ప్రత్యేకత సాధించింది. ఈ సంస్థ వార్షిక ఆదాయం.. 2 మిలియన్ డాలర్లకు చేరింది. ఈ సంస్థ స్థాపించటానికి ముందు అభిజిత్ ఇంధన రంగంలో ప్రసిద్ధ సంస్థ ష్కులమ్ బెర్గర్‌లో ఎనిమిదిన్నర సంవత్సరాలపాటు పనిచేశాడు. ఆ తర్వాత ఆహార పానీయాల రంగంలో ప్రవేశించాడు. ఒంటి చేత్తో నిధుల సమీకరణ చేసుకున్నాడు. రెండేళ్లలో ఆరు మిలియన్ డాలర్లు సేకరించగలిగాడు.

• **అభిజిత్ ఆనంద్,** ఫౌండర్, సీఈఓ, అబ్ కాఫీ

